

# భవానీద్వీపం

–వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 32 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

జయ బజరంగ బలీ! జయరాం! అన్న ధ్వనులు సోకాయి సమర్థుని చెవులకు. శరీరంలోని ఎముకలు నుగ్గు నుగ్గు అవుతున్నబాధకు మూతలుపడుతున్న కనులు తెరుచుకున్నాయి. శరీరం ఆపాదమస్తకం కోట్ల విద్యుల్లతలు ప్రసరించినట్టు ఒక్క క్షణం కంపించింది. ఆయన శరీరం లోహమయం అయినట్టు అనుభూతి చెందాడు.

పెద్దగా అరుస్తూ కఱ్ఱలు బరిశెలతో శక్తివంచన లేకుండా ఆ మహాసర్పాన్ని గాయపరిచే ప్రయత్నాలు చేస్తున్నారు అగస్త్యపెరియాసన్ శిష్యులు. తలను బలంగా విసురుతూ వారిని భయపెడుతూ ఎదురుదాడి చేస్తున్నది అది. అవకాశం దొరికితే సమర్థుని తలను చిక్కించుకోవాలని దాని ప్రయత్నం.

ఆ ప్రక్కన పెరియాసన్ అదే స్థితిలో ఉన్నాడు. పెరియా! పెరియా! అని అరుస్తూ, ఆయనను చుట్టుకున్న కొండచిలువను నిలువరించడానికి ప్రయత్నం చేస్తున్నారు శిష్యులు. వారి దెబ్బలను తప్పించుకోడానికి, వారిని గాయపరచడానికి అది తలను విసురుతున్నపుడల్లా దాని పట్టు బిగుస్తున్నది పెరియాసన్ శరీరం మీద. ఆయన స్పృహలో లేడు.

పంక్తికంఠన్ పరిస్థితి అత్యంత దారుణంగా వుంది. అతని తలను పూర్తిగా మింగేసింది కొండచిలువ. మిగిలిన శరీరాన్ని కబళించడానికి మెలికలు తిరుగుతూ అతడిని లోపలికి లాక్కుంటున్నది. శిష్యులు దానిని విడవకుండా శక్తికొద్దీ కర్రలు బరిశెలతో కొడుతున్నారు, పొడుస్తున్నారు. బరిశెల పోట్లకు చిన్న చిన్న గాయాలు మాత్రమే అవుతున్నాయి ఆ మహాసర్పాలకు. కఱ్ఱలతో బాదుతుంటే దబ్బున చప్పుడు అవుతున్నది. ఆ మహాసర్పాలు మెలికలు తిరుగుతూ తలలు విసురుతుంటే ఆకులూ ధూళీ రేగుతున్నాయి. పంక్తి కంఠన్ మీద దాదాపు ఆశలు వదులుకునే స్థితికి వచ్చారు ఆ నలుగురు శిష్యులు.

శరీరంలో నరనరానా విద్యుత్తు ప్రసరించినట్లు అయ్యింది సమర్థునికి. లోహంతో చేసినట్లు దృఢమైన బాహువులను సాచాడు. ఒక్కసారి కంపించినట్లు అయ్యింది ఆ మహాసర్పం. చివ్వున తలను తిప్పి సమర్థుని వైపు చూసింది. ఆ కాస్త వ్యవధిలో దాని తలను కుళ్ళబొడిచే ప్రయత్నాలు చేశారు నలుగురు శిష్యులు. వారిపైకి మరలింది మళ్ళీ.

దాని బలమైన బంధంలో యిరుక్కున్న రెండు చేతులను దగ్గరికిచేర్చాడు సమర్థుడు. ఆయన కంఠం నుండి దివ్యమైన ధ్యానశ్లోకం వెలువడింది. సుదర్శనసంహితలోని మహాశక్తివంతమైన పంచముఖ హనుమాన్ కవచం లోనిది ఆ ధ్యానశ్లోకం. సాక్షాత్తూ సీతాదేవికి శ్రీరామచంద్రుడు, పార్వతీదేవికి పరమశివుడు ఉపదేశించిన ఆ కవచాన్ని గరుత్మంతుడు ఉపదేశించాడు సాధకులకు.

'వందే వానర నారసింహ ఖగరాట్' అని ధ్యానప్రారంభం చేసి కనులు మూసుకున్నాడు సమర్థుడు. రెండు అరచేతులను గరుడముద్రలో వుంచాడు. సిద్ధిని పొందితే వజ్రసదృశమైన శక్తిని ప్రసాదించే ముద్ర అది. మరణోన్ముఖులైన వారికి కూడా మృత్యుంజయుడి శక్తిని ప్రసాదిస్తుంది. సమర్థుని అంతర్నేత్రంలో దివ్యమైన ఐదుముఖాలతో హనుమ దర్శనమిచ్చాడు. ఆ మహాసర్పం రెప్పపాటు కాలం సుడిగాలికి తీగలా కదిలిపోయింది. 'పశ్చిమం గారుడం వక్త్రం, వక్రతుండం మహాబలం, సర్వనాగప్రశమనం విషభూతాదికృన్తనమ్' గంభీరంగా వెలువడుతోంది సమర్థునినోటివెంట. విచిత్రం! అంతవరకూ భయంకరమైన బుసలతో శిష్యులమీదికి విసురుతున్న తల బలం తగ్గినట్లు కనిపించింది. బుసలు బలహీనమయ్యాయి. దాని వేగం తగ్గింది. శిష్యుల దాడి వుధృతమైంది. ఆ దెబ్బలకు అది బలహీనపడుతున్నట్లు కనిపిస్తున్నది యిప్పుడు.

సమర్థుని కనులముందు ఒక మహాద్భుతమైన ఆకారం కనిపించింది. ముందు ఎక్కడో అంతు తెలియని దూరంలో ఒక చిన్న చుక్కలా కనిపించింది. అంతకంతకూ వర్ణించలేనంత వేగంతో అది సమీపిస్తుంటే ఆ దిగ్భ్రమ కలిగించే మహారూపం క్రమేపీ స్పష్టంగా కనిపిస్తున్నది. సమర్థుని శరీరం కంపించిపోయింది. ఆయనను బలంగా చుట్టిన ఆ మహాసర్పం వదలిపోయినట్టు యిప్పుడు తలను నేలకు వాల్చింది. శిష్యులు ఆనందంగా ఉత్సాహంగా కేకలు పెడుతున్నారు. వారిదెబ్బలకు యిప్పుడు అది లొంగిపోతున్నట్లు కనిపిస్తున్నది.

సమర్థుని కనులకు యిప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నది. అది ఒక దివ్యస్వరూపం. కొండలాంటి మూపు వున్నది. మోకాళ్లనుండి బలమైన తొడలు బంగారు రంగులో వున్నాయి. మొలభాగం మిరుమిట్లుగొలిపే తెల్లని కాంతులతో వున్నది. నడుమునుండి కంఠం వరకూ కుంకుమ రంగులో యెఱ్ఱగా ప్రకాశిస్తున్నది. వంద పున్నమిచంద్రులవంటి తెల్లని పొడవైన ముక్కు వున్నది. ఆ ముక్కు చివర భయంకరంగా కొనదేలి వంపుతిరిగి నల్లగా వున్నది. తెరచాపలవంటి విశాలమైన రెక్కలు, ఈకలు బంగారు రంగులో మెరిసిపోతున్నాయి. రెండుకాళ్ళవేళ్ళకు విచ్చుకత్తులలాంటి పదునైన గోర్లు

మెరుస్తున్నాయి. పసుపురంగులో కనులు మెరుస్తున్నాయి. దిక్కులు దద్దరిల్లేలా 'క్రీం క్రీం' ధ్వనులు చేస్తూ వచ్చింది. అది అద్భుతమైన పక్షి రూపం. అది గరుత్మంతుని స్వరూపం.

'స్వస్తికో దక్షిణం పాదం వామపాదంతు కుంచితమ్..' అప్రయత్నంగా సమర్థుని నోటివెంట మహాగారుడ ధ్యానశ్లోకం వెలువడింది. అధర్వణ వేదాంతర్గతమైన ఉపనిషత్తులోని మంత్రశ్లోకం అది. పచ్చని బంగారు ముద్దల్లా మెరుస్తున్న కనులతో సమర్థుని కనులలోకే చూస్తున్నది ఆ దివ్యవిహంగం. ముఖంలో ముఖం పెట్టి చూసింది అరనిముషంపాటు. కుడి రెక్కతో సమర్థుని తలపై చిన్నగా చరిచింది, నిమిరినట్టు. అంతే! ఒక్కసారిగా లక్షసూర్యుల కిరణాలు కంటికి సోకినట్లు అయింది సమర్థునికి. ఆయన కనులు ఎఱ్ఱగా కాల్చిన బంగారు ముద్దల్లా మెరిశాయి క్షణకాలం. ఆ దివ్యమైన రూపం కరిగి, మాయమైంది.

అంతవరకూ ఎముకలు పిప్పిచేస్తూ చుట్టుకున్న ఆ మహాసర్పం వుత్తి దారపు పోగులాగా వ్రేలాడబడిపోయింది. 'జయజయ రఘువీరసమర్థా' అని అడవి మారుమ్రోగేలా నినదిస్తూ లేచి నిలుచున్నాడు సమర్థుడు. కర్రల దెబ్బలకు బరిశెల పోట్లకు విలవిలలాడుతున్నది ఆ కొండచిలువ. గోధుమరంగులో వున్న తోకను కదిలిస్తూ నిలువునా మెలికలు తిరిగిపోతున్నది. బరిశెలను గునపాలలాగా దాని తలలోకి దించి చీల్చేశారు శిష్యులు. ఆకుపచ్చని ద్రవంతో కలిసిన దాని రక్తంతో తడిసిపోయాయి వారి శరీరాలు.

సింహాలలాగా దూకుతూ అగస్త్యపెరియాసన్ ని సమీపించారు శిష్యులు. ఒక కాలిమీద స్థిరంగా నిల్చుని అంజలిముద్రలో కనులు మూసుకున్నాడు సమర్థుడు. 'ఓం పశ్చిమముఖాయ గరుడాననాయ పఞ్చముఖహనుమతే మంమంమంమంమం సకలవిషహరాయ స్వాహా' అనే మంత్రం వెలువడింది ఆయన నోటివెంట. అప్పుడు కనులు తెరిచాడు. 'ఓం ఈం ఏహ్యేహి శ్రీమహాగరుడాప్రతిహతశాసనా..సర్వవిషం నాశయ నాశయ హస హస దహ దహ

పచ పచ భస్మీకురు భస్మీకురు హుం ఫట్ స్వాహా' అని పఠిస్తూ నిశితంగా చూశాడు. సుదర్శనసంహితలోని మంత్రానికి గరుడోపనిషత్ మంత్రాన్ని జోడించిన మహాశక్తి అది. దానికి సమర్థుని చూపుల శక్తి తోడైంది. అంతే! కెరటంలాగా తలను విసురుతున్న కొండచిలువ తలను నేలకు వాల్చింది. కదలికలు లేకుండా బలహీనంగా వుండిపోయింది. శిష్యుల బరిశెలు దాని తలను చీల్చేశాయి.

మెరుపులాగా వారిని దాటుకుని పంక్తికంఠన్ వద్దకు చేరుకున్నాడు సమర్థుడు. అప్పటికి మెడవరకూ అతడిని మింగేసింది ఆ కొండచిలువ. సమర్థుని చేతులు పడడంవల్లనో, రెట్టించిన వుత్సాహంతో శిష్యులు దాడిచేయడంతోనో తెలియదు, అది కూడా వదలిపోయినట్లు కనిపించింది. దాని మెడమీద బరిశెలను దించి నోటివరకూబాదంకాయను చీల్చినట్లు చీల్చిపారేశారు. దాని నోటిలో యిరుక్కున్నపంక్తికంఠన్ తలను బయటకు లాగేశారు.

'కుమార గురవే! కుమార గురవే! శరవణ భవ జయ కుమార గురవే!' అనే నినాదాలతో అడవి దద్దరిల్లింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS